

# 'అదే' కథలు

– ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని ‘దేశీ’లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం ‘య’ అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి. అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకీ, బాధలకీ, దుఃఖాలకీ నా బాధ్యత లేదు.

## 65

## గుళ్ళో దేవుడు

**ఊళ్ళో ఉన్న గుడిలో** శుక్రవారం సాయంత్రం వెంకటేశ్వర కళ్యాణం ప్రోగ్రాం పెట్టారు. దానికి తప్పకుండా రావాలని ఫోను మీద ఫోను, పోస్టులో ఉత్తరం, ఈమెయిల్ పంపించారు గుడిలో ఉన్న కమిటీవారు. వెళ్ళకపోతే బాగుండదు కదా? అయితే ఎంతమంది వస్తారో, ఎంతసేపు పడుతుందో ఈ ప్రోగ్రాం అనేవి తెలియవు. ఆరింటికి మొదలుపెడితే ఏ ప్రోగ్రాం అయినా అయ్యేసరికి తొమ్మిది అవదూ? అందులోనూ మనవాళ్ళు అందరూ ఆరింటికి ఎలా వస్తారు, ఐదింటిదాకా ఆఫీసులో పనిచేసాక? ఈ ప్రోగ్రాం గురించి తెలిసాక కమిటీలో మెంబర్ అయిన రాజశేఖర్ చేసిన మొదటి పని అమ్మగారిని పులిహోర చేయమని బతిమాలడం. రెండోది స్నేహితులకి ఫోన్ చేసి వాళ్ళందరూ ఎప్పుడొస్తున్నారో అసలు ఎంతమంది వస్తారో కనుక్కోవడం. దేవుడి పెళ్ళికి అందరూ పెద్దలే, ఆహ్వానితులే కదా? ఇది రాజశేఖర్ తరపు సంగతి. అయితే అమ్మగారికి ఈయన ఏది చెప్తే అది చేయడం నచ్చలేదు. పులిహోర చేయడం సంగతి అలా ఉంచి ఎవరు వస్తున్నారో కూడా తెలియాలి. అలా తెలిస్తే ఒకరితో ఒకరు మాట్లాడుకుని తలో ఐటం భోజనం తయారు చేయవచ్చు. లేకపోతే ఇరవై మంది, ఇరవై బేసిన్ల పులిహోరతో తేల్తారు గుడిలో. దానికి అందరూ నవ్వడం ఒక

ఎత్తైతే ఎంత సిగ్గుచేటు అలా నవ్వించుకోవడం! అలా అమ్మగారు కూడా స్నేహితులతో మాట్లాడి పులిహోరో మరోటో తయారు చేస్తారు. డోన్ట్ యూ వర్రీ, కనీసం మూడు రకాల పదార్ధాలలతో డిన్నర్ గారంటీ.

రాజశేఖర్ ఫోనులు చేసి కనుక్కుంటే ఆరుగురు తప్పకుండా వస్తామనీ, ఇద్దరు రావడం కుదరదనీ, మరో పన్నెండు మంది అటూ ఇటూ తేల్చుకోలేమనీ లెక్కతేలింది. ఆరుగురు స్నేహితులూ వాళ్ళ పిల్లలూ, అర్ధాంగిలూ వస్తారు కనీసం. అది చాలు కదా? శుక్రవారం లోపున అమ్మగారు కూడా తన స్నేహితులతో మాట్లాడి భోజనానికి ఎవరెవరు ఏమి తయారుచేయాలో, ఎంత చేయాలో అన్నీ నిర్ధారించారు. ఒకావిడని కూర చేసి తెమ్మంటే, అబ్బే కుదరదు పులిహోర చేస్తానన్న అవిడతో కాస్త వాదోపవాదాలు. పులిహోర అయితే ఈజీ, కూర అయితే కోయడం వండడం అదీ సమయం పడుతుంది. మొత్తానికి ఏదోలా జనాలని వప్పించారు – ఒకరు పువ్వులు, మరొకరు అన్నం (క్షమించాలి, తెలుగు అర్ధం అవని మనవారికి దేవభాషలో చెప్పాలి కనక ప్లెయిన్ రైస్), కొంతమంది ఖీరా (పాయసం అంటే గుడికి వచ్చే గుజరాతీ, తెలుగేతర సోదరసోదరీమణులకి నచ్చదు కనక), కంగారుగా ఆఖరి క్షణంలో బయల్దేరేవారికి ఉన్న సులువు అరటిపళ్ళు, లేదా మరో రకం పళ్ళు కొని బాలాజీకి అర్పించుట. మొత్తానికి వెళ్ళడానికి, వెళ్ళేటప్పుడు తీసుకెళ్ళే భోజనానికి ఏర్పాట్లు జరిగేయి. పిల్లలకి స్కూల్ నాలుగులోపు అయిపోతుంది కనక వాళ్ళు రాగానే వేరే 'గుడికెళ్ళే బట్టలు' వేసుకుని సిద్ధం చేస్తే అయిదింటికి బయల్దేరవచ్చు. కొంచెం ముందు అయితే మరీ మంచిది. ప్రతీచోటా వివరణ ఇచ్చుకోకపోతే తిట్టుకుంటారు కనక 'గుడికెళ్ళే బట్టలు' అంటే చెప్పుకోవాల్సిందే. లాల్చీ పైజమా లాంటి రంగుల బట్టలు అయ్యగారికీ, తప్పనిసరి పట్టుచీర అమ్మగారికీ, పిల్లలకి ఆ మధ్య ఇండియా వెళ్ళినప్పుడు కొనుక్కొచ్చిన దేశీయ బట్టలు. అయ్యగారు గానీ మాసిపోయిన జీన్స్, టీ షర్ట్ వేసారా ఆయనకి ఇంక మూడినట్టే ఆ రోజు, మిగతా నెల అంతాను.

గుడికి బయల్దేరేసరికి చిన్న అవాంతరం. కార్లో తాగడానికి మంచినీళ్ళ బాటిళ్ళు లేవు, వండి పెట్టుకున్న పదార్ధం సరిగ్గా పేక్ చేయకపోతే లీక్ అవ్వొచ్చు దారిలో బండి కుదుపుకి. అమ్మాయి వేసుకున్న దేశీయ బట్టలు సరిగ్గా బొందు లేక లూజ్ గా ఉంది. కుర్రాడు షర్ట్ బటన్స్ సరిగ్గా పెట్టుకోలేదు. ఈ బాలారిష్టాలన్నీ దాటుకుని, పిల్లలిద్దరూ తమ తమ టాబ్లెట్ల మీద వీడియోలలో మునిగాక బండి రోడ్డుమీదకి వచ్చేసరికి అయిదుంపావు. ట్రాఫిక్ దాటుకుంటూ గుడికి వెళ్ళేసరికి సరిగ్గా ఆరు.

గుడికి వెళ్ళగానే మొదట చేయాల్సింది ఏమిటి? చెప్పులు ఇష్టం వచ్చినట్టూ వదిలేసి లోపలకి వెళ్ళిపోవడం. గర్భ గుడిలో దేవుడు దూరంగా ఉన్నాడు. అక్కడనుంచి ఈ మూలవరకూ జనం కూర్చుని ఉన్నారు. అనుకున్నట్టే పూజా అదీ ఇంకా మొదలవలేదు. రాజశేఖర్ రాగానే ఆయన ఆహ్వానించిన ఆరుగురూ, రాలేమోమో అనుకుంటూ చివరి నిముషంలో వచ్చిన మిగతావారు ఈయనకి చేతులు ఊపారు. ఈయన వాళ్ళకి ఒక్కొక్కరికీ కరచాలనం చేసి పక్కనే ఉన్న వారివారి భార్యామణులని పలకరించి – "గ్లాడ్ టు సీ యు, ఆఫ్టర్ ఎ లాంగ్ టైం" అని చెప్పేసరికి మరో పావుగంట. ఈ లోపుల

ఇదే తంతు అమ్మగారి వైపు కూడా. వాళ్ళు చేతులు ఊపితే ఈవిడ వెళ్ళి పలకరించడం, 'ఈవిడ చీర భలే ఉంది' అని కొంతమంది అసూయతో ఉడుక్కుంటే మరి కొంతమంది దూరపు స్నేహితులకి 'ఈవిడ క్రితంసారి కూడా ఇదే చీరతో వచ్చినట్టుందే' అనుమానం. ఇంకా దగ్గిర స్నేహితులైతే మెడలో వేసుకున్న గొలుసూ, నగా, వడ్డాణమో వంకీయో చూసి బాగుందన్నట్టూ నవ్వడం వగైరా. ఈ తతంగం అటూ ఇటూ కాసేపు నడిచింది. నేను అనుకుంటూనే ఉన్నాను కదా, మీరు 'పిల్లల సంగతో?' అని అడుగుతారని. వాళ్ళు ఇప్పటికే చేతిలో టాబ్లెట్లు రాజశేఖర్ మీద పారేసి మిగతావారి పిల్లలతో కలిసి గుడిలోంచి బయటకి వెళ్ళి ఆడుకుంటున్నారు. కనీసం అలా అయినా టాబ్లెట్ ల మీద నుంచి దృష్టి మరల్చారు అని రాజశేఖర్ చిన్న సంతోషం. ఇప్పటికి రాజశేఖర్ పని అయిపోయింది గుడి గుమ్మం దగ్గిర.

ఈ కథలో రాజశేఖర్, భార్యామణి, వారి పిల్లలు అనేది మనం అందరమూను. ఇప్పుడు మెల్లిగా జనాలని దాటుకుంటూ దేవుడికి దగ్గిరగా వెళ్ళి వెంకటేశ్వరుడికి సహపత్నీ సమేతస్య ఓ నమస్కారం పెట్టుకుంటాం. ఇంకా పూజ, కళ్యాణం మొదలుపెట్టలేదు కనక పక్కనే ఉన్న వినాయకుడికీ, శివుడికీ నమస్కారం పెట్టుకుని నుదిటిమీద విభూదీ, కుంకుమా ధరించి ఓ ఖాళీ చోటు చూసుకుని హమ్మయ్య అంటూ కూర్చున్నాక మీకేం గుర్తొచ్చింది? గుడి లోపలకి వెళ్ళే మొదటి గడపలో గోడకి అంటించిన కాయితం మీద ఏమి రాసారో మీకు తెల్సు అది ఎప్పుడు చూసేదే కనక, అంతకు ముందు ఎన్నోసార్లు చదివారు కనకా. అందులో ఏముందో గుర్తొచ్చిందా? లేదు. పిల్లలు ఎక్కడ ఉన్నారో ఏం చేస్తున్నారో అనేది గుర్తొచ్చిందా? ఆ విషయం పిల్లల వయసు బట్టి ఉంటుంది. మరీ చిన్న పిల్లలైతే మన దగ్గిరే ఉంటారు కనక ఇబ్బంది లేదు. కొంచెం పెద్దవాళ్ళైతే మిగతా పిల్లలు కూడా ఉన్నారు కనక కంగారు లేదు. మీరు పిలిచిన స్నేతులందరూ వచ్చినట్టే అనేది గుర్తొచ్చిందా? గుడిలోకి రాగానే మొట్టమొదట మీరు ఏం చేసారో గుర్తొచ్చిందా? అసలు గుడికి ఎందుకొచ్చారో కూడా గుర్తు రాలేదా? పట్టుకొచ్చిన భోజనం ఎక్కడ పెట్టారో ఏమిటో అనేదా లేక మరొకటా?

గుడిలో మొదటి గడపమీద అంటించిన కాయితం మీద ఏమి రాసుంది? నిశ్శబ్దం పాటించండి. మనసు దేవుడి మీద లగ్నం చేయండి. లోపలకి వెళ్ళి అన్నింటికంటే మొదటగా చూడాల్సింది దేవుణ్ణి, స్నేహితులని కాదు. మీరు ఏ బట్టలు వేసుకున్నారు, మీ ఆవిడ ఏ చీర కట్టుకుని ఏ నగలు వేసుకుంది, ఎంతమందికి కరచాలనం చేసారు అనేవి, ఏమి పట్టుకొచ్చారనేవి అన్నీ తర్వాత చూసుకోవచ్చు. కనీసం ఆ కాయితం మీద రాసిన 'చెప్పులు సరిగ్గా అరలలో పెట్టండి' అనేది పాటించారా? ఈ గుడి మనందరిదీ, శుభ్రత పాటించండి అనే విషయమేనా పాటించారా? ఇవన్నీ ఎవరైనా మీకు గుర్తు చేస్తే 'గుడికి వచ్చి జనం ఇలా తప్పులు చేస్తున్నారని గమనించడం తప్ప మీకు పనేమీ లేదా?" అని గుర్తు చేసిన వారిని వెక్కిరించడానికి సిద్ధమౌతున్నారా?

**నీతి: గుడికి వచ్చిన స్నేహితులు ఎప్పుడు వెళ్ళిపోతారో తెలియదు. కదలలేని దేవుడెక్కడికీ పోడు.**

Post your comments